‘రాష్ట్రస్థాయిలో జిల్లాకు రజత పతకం’

జిల్లా జట్టుతో క్రీడల అధికారులు, క్రీడా సంఘాల నాయకులు

రెబ్బెన, డిసెంబర్ 29 : హనుమకొండలోని జవహర్‌లాల్ స్టేడియంలో 27 నుంచి 29వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా సీఎం కప్ పోటీల్లో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జట్టు రజత పతకం సాధించినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గోలేటి క్రీడాకారులు ఆర్ వెంకటేశ్, ఏ రాజేందర్, పీ రాజశేఖర్, కే తిరుమలేశ్, కే రాజశేఖర్, సీహెచ్ శ్రీకాంత్ పాల్గొన్నట్లు పేర్కొన్నారు. వీరిని జిల్లా యువజనుల క్రీడల అధికారి రమాదేవి, స్పోర్ట్స్ అధికారి మీనారెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ సాగర్, హనుమకొండ యువజనుల అధికారి అశోక్‌కుమార్, జిమ్నాస్టిక్ కోచ్ నరేందర్, ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఆర్ నారాయణరెడ్డి, సెపక్ తక్రారాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్లు భాస్కర్, రామకృష్ణరెడ్డి, కుమ్మరి మల్లేశ్ అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఆత్రం స్వప్న

శ్రావణి

రెబ్బెన, డిసెంబర్ 29 : జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రెబ్బెన మండలంలోని గోలేటి గ్రామానికి చెందిన క్రీడాకారిణులు ఆత్రం స్వప్న, శ్రావణి ఎంపికైనట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ నారాయణ రెడ్డి తెలిపారు. మహారాష్ట్రలో 26 నుంచి 30వ తేదీ జరిగే 70వ జాతీయస్థాయిపోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆత్రం స్వప్న మహిళా జట్టుకు కేప్టెన్‌గా వ్యవహరించనుందని తెలిపారు. వీరిని రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎస్ తిరుపతి, పీఈటీ భాస్కర్, షార్ప్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగ మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, కోశాధికారి శంకర్, అంతర్జాతీయ రిఫరీ కుమ్మరి మల్లేశ్, క్రీడాకారులు ఆర్ శ్రీనివాసరెడ్డి, మారిన చందర్, లక్ష్మణ్, సదానందం, సాంబయ్య, లింగారెడ్డి, హరిలాల్, గుజ్జ మల్లేశ్, రామకృష్ణ, రెడ్డి సతీశ్, తౌఫిక్, వీ సతీశ్, శ్రీధర్, చిన్ని అభినందించారు.

శాంతియుతంగా వేడుకలు నిర్వహించాలి

మాట్లాడుతున్న ఎస్ఐ చంద్రశేఖర్

రెబ్బెన, డిసెంబర్ 29 : రెబ్బెన పోలీస్‌స్టేషన్ పరిధిలో డిసెంబర్ 31, నూతన సంవత్సర వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ డీ చంద్రశేఖర్ ఆదివారం యువత, ప్రజలకు సూచించారు. 31వ తేదీ సాయంత్రం 7 నుంచి స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ ఉంటుందని, పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి, బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మాదకద్రవ్యాలు సేవించే వారిపై ఎప్పటికప్పుడు డ్రగ్స్ టెస్టింగ్ కిట్ల ద్వారా తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. పోలీసుల సూచనలు పాటిస్తూ సహకరించాలని సూచించారు.

కమ్మ సేవా సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 29 : కమ్మ సేవా సమితి మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల 2025 క్యాలెండర్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. రాష్ట్రస్థాయి కాంగ్రెస్ నాయకుడు బండి రమేశ్, కమ్మ సేవా సమితి అధ్యక్షులు వడ్డే వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి గంగవరపు వెంకటేశ్వరరావు, కోశాధికారి వెనిగళ్ల శ్రీనివాసరావు, ప్రధాన సమన్వయకర్త బోతనపల్లి కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి మేడసాని చెన్నకేశవులు, కార్యవర్గ సభ్యులు గొడవర్తి సత్యనారాయణ, గంగవరపు శ్రీనివాసరావు, గంగవరపు హరినారాయణ, గంగవరపు అజయ్, పచ్చవ వెంకటేశ్వర్లు, నల్లూరి సిద్ధయ్య, మచ్చ కొండయ్య, పచ్చవ వెంగయ్య నాయుడు, పాటిబండ్ల సుధాకర్, మచ్చ మాల్యాద్రి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-AII

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

అధ్వానం.. చిల్డ్రన్ ప్లే గ్రౌండ్స్

కొట్టుకుపోయిన ఇసుక.. ఊడిపోతున్న పరికరాలు

- గాయాలపాలవుతున్న చిన్నారులు
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు
- నీరుగారుతున్న కేసీఆర్ ప్రభుత్వ ప్రయత్నాలు
- నిర్లక్ష్యంగా అధికారులు.., పట్టించుకోని పాలకులు

కేసీఆర్ ప్రభుత్వం.. సర్కారు పాఠశాలలను ఆటవిడుపు కేంద్రాలుగా తయారు చేసేందుకు చేసిన ప్రయత్నాలు.. అధికారుల నిర్లక్ష్యం, పాలకుల పట్టింపులేనితనంతో నీరుగారుతున్నాయి. పాఠశాలలపై చిన్న పిల్లల్లో ఆసక్తి పెంచేందుకు ఏర్పాటు చేసిన చిల్డ్రన్ ప్లే గ్రౌండ్స్ నిర్వహణ సరిగాలేక అధ్వానంగా తయారయ్యాయి. ఇసుక కొట్టుకుపోవడం.., ఆట పరికరాలు ఎక్కడికక్కడ విరిగిపోవడంతో పాటు, ఊడిపోయి ప్రమాదకరంగా మారాయి. చిన్నారులు అటువైపు వెళ్లేందుకు జంకుతుండగా, లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ ప్లే గ్రౌండ్స్‌ను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా కాలనీల ప్రజలు, తల్లిదండ్రుల నుంచి సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని పరికరాలకు మరమ్మతులు చేయడంతో పాటు గ్రౌండ్‌ను సరిచేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. **- మందమర్రి, డిసెంబర్ 29**

ఊడిపోవడంతో పక్కన పెట్టిన పరికరం

12వ వార్డులోని గ్రౌండ్‌లో ఊడిన పరికరాలు

అధ్వానంగా మందమర్రి మున్సిపాలిటీ 12వ వార్డులో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ ప్లే గ్రౌండ్

కేసీఆర్ సర్కారు.. ప్రభుత్వ పాఠశాలలంటే చిన్నపిల్లల్లో ఆసక్తిని పెంచేందుకు అనేక మార్పులు తీసుకువచ్చింది. ‘పట్టణ ప్రగతి’లో భాగంగా స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, గోడలకు ఆకర్షణీయమైన రంగులు వేయడం, సందేశాత్మక చిత్రాలను గీయించడం, ఆలోచింపజేసేలా వివిధ సూక్తులను రాయడంతో పాటు, చిన్న పిల్లలు(ప్రాథమిక స్థాయి) ఆడుకునేందుకు పాఠశాలల ఆవరణల్లో చిల్డ్రన్ ప్లే గ్రౌండ్స్‌ను ఏర్పాటు చేశారు. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఫిల్టర్‌బెడ్, ఊరు మందమర్రి, రెండోజోన్, సుభాష్‌నగర్, విద్యానగర్, సింగరేణి తదితర పాఠశాలలతో పాటు, రెండోజోన్ 12వ వార్డు, ఒకటో వార్డు యాపల్ సింగరేణి జీఎం కార్యాలయ సమీపంలో ఒక్కో చిల్డ్రన్ ప్లే గ్రౌండ్‌కు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల పట్టణ ప్రగతి నిధులను వెచ్చించారు. చిన్న పిల్లలు ఆటలాడుకునేలా ఊయలలు, జారుడుబల్ల, వీల్‌చైర్ తదితర ఆరు రకాల ఆట పరికరాలను ఏర్పాటు చేశారు. ఆటలాడే సమయంలో విద్యార్థులు విశ్రాంతి తీసుకునేందుకు బెంచీలను కూడా ఏర్పాటు చేయడంతో పాటు, వివిధ రకాల రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పిల్లలు ఆడుకునే సమయంలో కింద పడితే గాయాలు కాకుండా చిల్డ్రన్ ప్లే గ్రౌండ్స్‌లో ఇసుక నింపారు. అయితే పిల్లల ఆటవిడుపు కోసం ఏర్పాటు చేసిన చిల్డ్రన్ ప్లే గ్రౌండ్స్.. నేడు అధికారులు, పాలకుల పట్టింపులేనితనంతో అధ్వానంగా తయారయ్యాయి. పరికరాలు ఎక్కడికక్కడ ఊడిపోయి ప్రమాదకరంగా మారాయి. వర్షాలు కురిసి గ్రౌండ్స్‌లోని ఇసుక కొట్టుకుపోయింది. దీనికి తోడు పరికరాలు ఊడిపోవడంతో ఆడుకునేందుకు వెళ్లిన పిల్లలు గాయాలపాలవుతున్నారు. దీంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పరికరాలు ఊడి పోవడంతో పిల్లలు సైతం వాటి వద్దకు వెళ్లేందుకు ఆసక్తిని చూపడంలేదు. లక్షలాది రూపాయల నిధులతో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ ప్లే గ్రౌండ్స్ నిర్వహణను ఎవరూ పట్టించుకోవడం లేదని, ఆయా కాలనీల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చిల్డ్రన్ ప్లే గ్రౌండ్స్‌లో పరికరాలకు మరమ్మతులు చేపట్టాలని కోరినా ఫలితం లేకుండా పోతున్నదని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని చిల్డ్రన్ ప్లే గ్రౌండ్స్‌లో ఊడిపోయిన పరికరాలకు మరమ్మతులు చేయడంతో పాటు, సరిపడా ఇసుకను నింపాలని కోరుతున్నారు.

పరికరాలు ఊడి పోతున్నయ్..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పిల్లలు ఆడుకునేందుకు ఆహ్లాదకరమైన వాతావరణంలో చిల్డ్రన్ ప్లే గౌండ్‌లను ఏర్పాటు చేశారు. అవి ఏర్పాటు చేసి ఏండ్లు గడుస్తుండడంతో అందులోని పలు పరికరాలు ఊడిపోయాయి. పిల్లలు ఆడుకునేందుకు వెళితే ఎక్కడ ప్రమాదాల బారిన పడుతారోననే ఆందోళన చెందాల్సి వస్తున్నది. ప్లే గ్రౌండ్‌లలో పోసిన ఇసుక వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో చిన్న పిల్లలు కింద పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు కలుగజేసుకొని పరికరాలకు మరమ్మతులు చేయాలి. **- సీపెల్లి సాగర్, మందమర్రి**

మరమ్మతులు, నిర్వహణ లేదు..

చిల్డ్రన్ ప్లే గ్రౌండ్‌లు ఏర్పాటు చేసి ఏండ్లు గడుస్తున్నా ఎలాంటి మరమ్మతులు గానీ, నిర్వహణ పనులు గానీ చేపట్టలేదు. దీంతో పరికరాలు ఊడిపోవడంతో పాటు ఇసుక కొట్టుకుపోయి గడ్డి పేరుకుపోయింది. చిన్నారులకు అహ్లాదాన్ని అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం చేసిన ప్రయత్నం విఫలమవుతున్నది. పరికరాలు ఊడిపోయాయని, ఇసుకుకొట్టుకు పోయిందనే విషయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లా పట్టించుకోవడంలేదు. దీంతో నిరుపయోగంగా మారే పరిస్థితి నెలకొంది. స్పందించి మరమ్మతులు చేపట్టాలి. **- అమృత రమాదేవి, మందమర్రి**

అక్రమంగా తరలిస్తున్న కలప దుంగల పట్టివేత

దండేపల్లి, డిసెంబర్ 29 : దండేపల్లి మండలం తాళ్లపేట రేంజ్ పరిధిలోని బీట్‌లో అక్రమంగా తరలిస్తున్న కలప దుంగలను పట్టుకున్నట్లు రేంజర్ సుష్మారావు తెలిపారు. కలప తరలిస్తున్నారనే సమాచారం మేరకు అటవీ అధికారులు వెంబడించగా, రెండు దుంగలను పడేసి నిందితుడు పారిపోయాడని పేర్కొన్నారు. వాటి విలువ రూ.5,649 ఉంటుందని తెలిపారు. కలపను రేంజ్‌కు తరలించారు. ఈ దాడిలో డిప్యూటీ రేంజ్ అధికారి సాగరిక, ఎఫ్‌బీవో రహీముద్దీన్, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.

వృద్ధుడి అదృశ్యం

బెల్లంపల్లి(తాండూర్), డిసెంబర్ 29 : తాండూర్ మండల కేంద్రానికి చెందిన గట్టు రాజయ్య(76) అదృశ్యమైనట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. రాజయ్య కొద్ది నెలలుగా మతిస్థిమితం లేక బాధపడుతున్నాడని పేర్కొన్నారు. ఆరు నెలల కితం ఇంటి నుంచి వెళ్లిన ఆయన ఇప్పటి వరకు తిరిగి రాలేదని తెలిపారు. వృద్ధుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆచూకీ తెలిసిన వారు 87126 56575 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 29 : మంచిర్యాల పట్టణంలోని పాతమంచిర్యాలలో గల 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక లోపాలకు మరమ్మతుల కారణంగా మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డీఈ ఎంఎం ఖైజర్, ఏడీఈ వేణుగోపాల్, రూరల్ ఏడీ మోహన్‌రెడ్డి తెలిపారు. మంచిర్యాలలోని రాంనగర్, ఏసీసీ, వేంపల్లి, నస్పూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాంస్కృతి శిక్షణకు ఉపాధ్యాయుడు

కాగజ్‌నగర్, డిసెంబర్ 29 : కాగజ్‌నగర్ మండలం చారిగాం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సుందిళ్ల రమేశ్ సాంస్కృతిక శిక్షణకు ఎంపికయ్యాడు. విద్యావిధానంలో భాగంగా ఎంఈపీ 2020 ప్రాథమిక పాఠశాలస్థాయి నుంచి విద్యార్థులకు సృజనాత్మక విద్యా బోధన అందించాలని, నూతన పరికల్పన అవకాశాలు ఇవ్వాలని, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే పప్పెట్రి బొమ్మల ద్వారా విద్యార్థులకు ఎలా బోధించాలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. పదిహేను రోజుల పాటు అస్సాంలోని గువాహటిలో శిక్షణ పొందనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి పది మందిని ఎంపిక చేయగా, అందులో సుందిళ్ల రమేశ్ ఉన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి సాయం

కాసిపేట, డిసెంబర్ 29 : కాసిపేట మండలం దేవాపూర్ అచ్యుతరావు గూడెంలో ప్రమాదవశాత్తు ఇల్లు కాలిపోయిన బాధితురాలు ఆత్రం సత్యవతికి పలువురు తమ వంతుగా సాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. మెస్రం రంజిత్ తన పుట్టిన రోజు సందర్భంగా వృథా ఖర్చు చేయకుండా 25 కిలోల బియ్యం, దుప్పట్లు, చీరలు, వంట పాత్రలు అందించారు. ఈ కార్యక్రమంలో మెస్రం రాధ, జనార్దన్, సోంబాయ్, టేకం ఇంద్రబాయ్, జనార్దన్, కమల, యూత్ కమిటీ సభ్యులు కోవ రాకి, కోవ కృష్ణ, సోను, విశ్వాస్ పాల్గొన్నారు. కొండాపూర్‌కు చెందిన ఎంబడి కిషన్ తన వంతుగా నిత్యావసర సరుకులు, బట్టలు అందించారు. కుటుంబ సభ్యులు ఎంబడి పద్మ, కార్తీక్, నాయకులు మేరుగు శంకరయ్య, కొమ్ముల బాపు, బాపు రావు, జనార్దన్, కమల, నానాజీ పాల్గొన్నారు.

హామీలను నెరవేరుస్తాం

మందమర్రి, డిసెంబర్ 29 : సింగరేణి యాజమాన్యంతో చర్చల ద్వారా గానీ, పోరాటాలు చేసైనా గానీ ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తెలిపారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఎన్నికల వాగ్దానాల్లో ప్రధానమైన కార్మికుల సొంతింటి కల సాకారం చేస్తామని, పెర్క్స్‌పై ఆదాయ పన్ను రద్దును సాధించి తీరుతామని పేర్కొన్నారు. మందమర్రి ఏరియాలో క్వార్టర్స్ లేని కార్మికులకు యాజమాన్యం ఇంటి అద్దె చెల్లింపులో జాప్యం చేయడం సరికాదన్నారు. కేకే ఓసీ మున్సిపాలిటీ పరిధిలోనే ఉందని, అందుకు సంబంధించిన ఆధారాలను మున్సిపల్ కమిషనర్ నుంచి తీసుకొని సింగరేణి ఎస్టేట్ అధికారులకు సమర్పించినట్లు చెప్పారు. అలాగే స్ట్రక్చర్ సమావేశంలో కూడా కేకే ఓసీ ఇంటి అద్దె చెల్లింపు విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అందుకు సంబంధించిన ఫైలును కార్పొరేట్‌కు పంపించినట్లు వెల్లడించారు. బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్, నాయకులు సోమిశెట్టి రాజేశం, అరకొండ ఆంజనేయులు, బానయ్య, తిరుపతి, వెంకటేశ్వర్లు, సీవీ రమణ, సుదర్శన్ రెడ్డి, దినేశ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అన్ని డివిజన్లలో మీడియా విభాగం

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 29 : అన్ని డివిజన్లలో మీడియా విభాగం ఏర్పాటు చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. సీసీసీ నస్పూర్ నర్సయ్య భవన్‌లో ఆదివారం ఏఐటీయూసీ మీడియా లోగోను ఆవిష్కరించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7, 5, 6, ఎస్సార్పీ-3, 1, ఐకే 1ఏ, ఓసీపీ గనులకు మీడియా విభాగం కార్యదర్శులుగా జాడి రాజ్‌కుమార్, రవీందర్, నాగరాజు, నగేశ్, ఆడెపు సురేశ్, రాజు, జయసూర్య, అమీర్‌పాషా, రాజశేఖర్‌ను నియమించారు. నాయకులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, అక్బర్‌అలీ, ఎస్‌కే బాజీసైదా, మోత్కూరి కొమురయ్య, అఫ్రోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దినచర్యలో యోగా, క్రీడలు భాగం కావాలి

బెల్లంపల్లి, డిసెంబర్ 29 : దైనందిన జీవితంలో యోగా, క్రీడలు భాగం కావాలని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వాహకుడు ఎనగందుల వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి యోగ, కరాటే పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్‌తో కలిసి దేవయ్య ప్రారంభించారు. టీపీసీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ బండి ప్రభాకర్, పీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, పీఈటీలు, కరాటే, యోగా మాస్టర్లు పాల్గొన్నారు.

జంగుబాయి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 29 : కెరమెరి మండలం పరందోలిలో నిర్వహించే జంగుబాయి ఉత్సవాల పోస్టర్‌ను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కమిటీ సభ్యులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జనవరి 2 నుంచి నెల రోజుల పాటు నిర్వహించే జంగుబాయి జాతరను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు, బీఆర్ఎస్ నాయకురాలు మర్సుకోల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అందుబాటులో ఉంటా

మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యాసంస్థ చైర్మన్ నరేందర్‌రెడ్డి

నస్పూర్, డిసెంబర్ 29 : రాబోయే రోజుల్లో అన్ని వర్గాల పట్టభద్రులకు అందుబాటులో ఉండి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ రూపకల్పనలో తన వంతుగా కృషిచేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. మంచిర్యాల పట్టణంలో ఆదివారం జిల్లాస్థాయి పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బీటెక్, ఎంటెక్ చదువుతున్న 70 శాతం మంది యువత సింగరేణి మైన్స్‌లో పనిచేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. వీఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ టీఎన్జీవో ఫంక్షన్‌హాలులో 450 మంది బీఈడీ పూర్తిచేసుకున్న నిరుద్యోగ యువతకు టెట్ కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు ఉపాధ్యాయులు, బ్యాంక్, ఇన్సూరెన్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, డిసెంబర్ 29 : శ్రీరాంపూర్ నుంచి మంచిర్యాల వరకు నరేందర్‌రెడ్డి బైక్ ర్యాలీ తీశారు. శ్రీరాంపూర్ కాలనీ బస్టాండ్ వద్ద ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి, జిల్లా గౌరవాధ్యక్షుడు దేవన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేందర్ ఆధ్వర్యంలో మహిళలు నరేందర్‌రెడ్డికి మంగళహారతులు పట్టి స్వాగతం పలికారు. అనంతరం మంచిర్యాలలో నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి ర్యాలీగా వెళ్లారు. సీసీసీ కార్నర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

బెల్లంపల్లి, డిసెంబర్ 29 : విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ విమర్శించారు. ఆ సంఘం 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బెల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే నినాదంతో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎల్లండి నిఖిల్, సభ్యులు పాముల అక్షయ్, బర్రె మంజునాథ్, బాసాని అక్షిత్ సాయి, సాయికృష్ణ, సాయికిరణ్, రాజశేఖర్, జశ్వంత్, రామ్ శెట్టి, అజయ్ పాల్గొన్నారు.

వేడుకల్లో నాయకులు

మహేందర్‌కు పర్యావరణ కవి పురస్కారం

మహాసభల్లో అందుకున్న ప్రశంసాపత్రం చూపుతున్న మహేందర్

చెన్నూర్ టౌన్, డిసెంబర్ 29 : విజయవాడలో జరుగుతున్న ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన కవులు బొడ్డు మహేందర్, మేకల రామస్వామి, దబ్బెట రాజమల్లు, తాళ్ల సురేశ్, మామిడి అక్షిత, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణంపై జరిగిన ప్రత్యేక తొలి కవి సమ్మేళనంలో చెన్నూర్‌కు చెందిన బొడ్డు మహేందర్‌కు పర్యావరణ కవి పురస్కారం లభించింది. జిల్లా రచయితల సంఘం మేకల రామస్వామి, అఖిల భారతీయ సాహిత్య పరిషత్ తరపున దబ్బెట రాజమల్లు భాషాభివృద్ధి సాంకేతిక మార్పుల గురించి సదస్సులో చర్చించారు. చెన్నూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి, రచయిత దబ్బెట రాజమల్లు కవి సమ్మేళనం, సాహితీ సదస్సులో పాల్గొన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పారు. తెలుగు సాహిత్యాభివృద్ధికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కవులను నిర్వాహకులు అభినందించారు. ప్రశంసాపత్రం, శాలువ, జ్ఞాపికతో సత్కరించారు.

మహా సమ్మేళనం జయప్రదం చేయాలి

మాట్లాడుతున్న పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం కమిటీ సభ్యులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 29 : ఆసిఫాబాద్ సరస్వతీ శిశు మందిర్ పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని స్థానిక సరస్వతీ శిశు మందిర్‌లో ఆదివారం కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. మహా సమ్మేళనం ఫిబ్రవరి 9న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల ప్రారంభం నుంచి 2023-24 బ్యాచ్ వరకు విద్యార్థులు పాల్గొంటారన్నారు. 200 మంది పూర్వ విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు పేర్కొన్నారు. కమిటీకి గౌరవ అధ్యక్షుడిగాసాయిని సంతోష్, అధ్యక్షుడిగా గద్దెలపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా వాసుదేవన శైలేష్, ముత్యాల ప్రదీప్, కార్యదర్శిగా ఇరుకుల్ల శ్రీనాథ్, సహ కార్యదర్శిగా పోలంపల్లి రాజశేఖర్, పుల్లూరి సంతోష్, కల్లూరి సంతోష్, కోశాధికారిగా జంజిరాల సతీశ్, ప్రచారకర్తగా కలకుంట్ల శ్రీధర్, సలహా సమితి కన్వీనర్‌గా కొడిపాక వేణుగోపాల్, నాగుల శ్రీనివాస్, మహిళా కమిటీ అధ్యక్షురాలిగా తాటిపల్లి జ్యోతిని ఎన్నుకున్నట్లు వెల్లడించారు. పూర్వ ఆచార్య కన్వీనర్‌గా చందావార్ బాలేశ్వర్ వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వరరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయం

మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీఎన్జీవో నాయకులు

హాజీపూర్, డిసెంబర్ 29 : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయమని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రెబ్బెన, డిసెంబర్ 29: రెబ్బెన మండలం కొండపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కొండపల్లి గ్రామానికి చెందిన వడ్డె బాపురావు (50) మృతి చెందాడు. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డె బాపురావు కూలీ పనులు చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్నాడు. కొండపల్లి బస్టాండ్ వద్ద ఉన్న చికెన్ సెంటర్‌లో ఆదివారం కూలీ పనులు చేసి వ్యర్థ పదార్థాలను ఊరి బయట పడవేసి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన బాపురావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకొని మృతికి గల వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీరాంపూర్‌లో సీపీఐ ఆవిర్భావ వేడుకలు

శ్రీరాంపూర్, డిసెంబర్ 29 : శ్రీరాంపూర్ కృష్ణా కాలనీలో ఆదివారం సీపీఐ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కే శంకర్ పాల్గొని, జెండా ఆవిష్కరించారు. పార్టీ కార్యాలయం వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ జెండా ఎగురవేశారు. నస్పూర్ పట్టణ కార్యదర్శి జోగుల మల్లయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మేకల దాసు, లింగం రవి, నగేశ్, నాయకులు మహేశ్, మల్లికార్జున్, పూజారి రామన్న, సురేశ్, సారంగపాణి, రాజ్‌కుమార్, దుర్గయ్య, సంజీవరెడ్డి, సందీప్, సంతోష్, నర్సింగ్ పాల్గొన్నారు. అలాగే శ్రీరాంపూర్ కొత్త రోడ్ నుంచి ఏర్పాటు చేసిన ర్యాలీని శంకర్ ప్రారంభించారు. కొత్త రోడ్ నుంచి ఆర్కే 6 గుడిసెలు, గాంధీనగర్, శ్రీరాంపూర్ కాలనీ, బస్టాండ్ వరకు ర్యాలీ తీశారు. నస్పూర్ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా సమితి సభ్యులు లచ్చిరెడ్డి, రాజేశ్వర్‌రావు, ముస్కె సమ్మయ్య, బాజీసైదా, శ్రీనివాస్, రాంచందర్, రవీందర్, చంద్రకళ, అశ్విని, ఉమ పాల్గొన్నారు.